# కవితా కౌముది

## వసంతం

శిష్ట్లా. వి.యల్.యన్.శర్మ



ఆకులెన్ని రాల్చినా
చెట్టు......చిగురుల చక్కదనాన్ని
చిక్కగా తొడుక్కుంటుంది
హరిత రాగాల్ని రచిస్తూ.....
కావలసిందల్లా ...జీవమే!
వసంతం దాటాక
దాక్కున్న .......కోయిల
పిలవకుండానే పాటై నిలుస్తుంది
ఆమనియై పిలుస్తుంది......
కావలసిందల్లా.....సమయ పాలనమే!
తోట దారిలో
యేటి పాట.....తోటమాలి
ఊహల్ని మీటుతూనే వుంటుంది
నందనోద్యానాల్ని నిర్మిస్తూ.....
కావలసిందల్లా...పాటతో జత కలపటమే!
పరిమళిస్తూ
వికసించే ......పుష్పాలు
రంగుల హరివిల్లులై నీ ఊహల
నింగిని తాకుతుంటాయి
వెన్నెల వన్నెల్ని పరుస్తూ...
కావలసిందల్లా......ఆస్వాదనమే!
ఎండుటాకులు
వదలిన .....అనుభవాలు
మళ్ళీ పచ్చదనమై
కొత్తగా విచ్చుకుంటాయి
జవ జీవాన్ని సృజిస్తూ.....
కావలసిందల్లా.....అనుభూతే!
ఎవరూ పిలువకుండా
ఎవర్నీ అడగకుండా
ఋతురాగ రాజమై
కాల క్రతువై నడిచి వస్తుంది....వసంతం! ★★★



# ఆత్మ శోధన

రఘు ఆళ్ళ

భలే పేరు పెట్టావే,
నీకు నువ్వే
ఆత్మ శోధనని!

నిజాల్నిప్పుల మీద
టపటపమని మండే
కొన్ని అక్షరాల్ని
ఏరదాం..వస్తావా !

మనసుకి ముసుగేసి
కళ్లతో వెతకడం కాదు
శోధనంటే!

ముసుగేసిన కళ్లతో కూడా
మనసుని ఆసాంతం తడిమి
చూసే గొప్ప యజ్ఞం!

గడియారబ్బట్టలేసుకున్న
కాలాన్ని
చేప చచ్చిన చేతికి కట్టడం కాదు
కాలపు విలువంటే!

తీసి పారేసిన
క్యాలండర్లలో సైతం
ఒక తేదీని నీకై రాసుకోవడమే!

ఆత్మ శోధనంటూ
ముసుగేసుకోని వెతికితే
దొరికేది
చచ్చిపోయి సమాధి కాబడని
కొన్ని కారణాలు
దోసెడు కంపు కనబడని పొగడ్తలు!

పోత పోసుకోని
పైకెదగడమే అర్థం,
తప్పు తెల్సుకోని
మసలు కోవడమే పరమార్థం!

ఎలానా?
సాయంత్రానికి పుట్టబోయే
రేపటి పగటిలా!!!!

***



# తెలుగింట పిలుపులు

వి.ఉదయలక్ష్మి

‘అమ్మ’ అంటే ఆలింగనమే
‘నాన్న’ నాది నాది అనే ఆలంబనే
‘తాతయ్య’ తరతరాలకు నీవాడనే అనే తృప్తి
‘నాయనమ్మ’ నాయనకేకాదు నాకు అమ్మవే మరి
‘అమ్మమ్మ’ అమ్మకి అమ్మ మరి నాకు మరో అమ్మ.
‘అన్నయ్య’ అమ్మలోని అనురాగం నాన్నలోని మమకారం నీదయ్యా.
నెయ్యమై నట్టింట నిలిచిన ‘వదినమ్మ’
‘అక్కయ్య’ అమ్మంత అధికారం, హక్కు నీకే ఉందికదా.
బరువు బాధ్యతలలో భుజం కలిపిన ’బావగారు’
‘పెదనాన్న’ నాన్నకే కాదు నాకు నీవు పెద్దే
‘ఆమ్మ’ దీర్ఘంలోనే ఉందమ్మ నీ స్థానం.. ప్రాధాన్యత.
‘మామయ్య’ నీవూ మా అయ్యవేలెయ్యా అన్న ఆపేక్ష.
‘అత్తయ్య’ అమ్మలోని అమ్మదనం తాతయ్యలోని తీయదనం నీవమ్మా.
‘బాబాయి’ నా బలం నీవు నా బాధ్యత నీవే.
ప్రేమే పిలుపైనది’ పిన్ని’ అని.
‘చెల్లి’ మల్లెపువ్వంత స్వచ్ఛమైన  చెలివి నెచ్చెలివి నీవు.
‘తమ్ముడు’ తన్మయత్వం కలిగించే పిలుపే అది.
మన తెలుగునట్టింట మమతల మాధుర్యాల పిలుపులు
కాలానికి నిలబడి కలకాలం నిలిచి అనుబంధాలను నిలిపే తలపులు..!

★★★★



# పచ్చపూల తెల్లఓణీ                శతపత్రమంజరీ

పచ్చపూల తెల్లవోణి మధ్యలో
జార్జెంట్ సిల్క్ వన్నె చిన్నబోయేలా
కొత్తగా చిరుగు పడిన వైరాగ్యం

★★★

అల్మారా అడుగున
అప్పుడప్పుడు ఇప్పటికీ వెంటాడే
ఘాటైన జ్ఞాపకాల దొంతర
పరిగిణీ,వోణికి నడుమ
ముడతపడిన కాలం మడతలలో
వాడి,ఎండి,నలిగి,విరిగి...
రెమ్మలు రెమ్మలుగా వీడిన
గుల్మోహర్ పూల పురా వైభవం

★★★

నిమిషానికో రకంగా
మారుతున్న భావ తీవ్రత
పాతదైన ప్రతి జ్ఞాపకం
హృదయాంతరాలను చీల్చుకుని
సీతకోకలై ఎగిరిపోతున్న భావన
ఓ కాలమా!
అహం పీకపైన గట్టిగా నొక్కి మరి
నీ ముంగిట మోకరిల్లి అడుగుతున్నా
"జీవితాన్ని మరోసారి పచ్చపూల తెల్లవోణితో,
మరోలాగా మొదలెట్టే అవకాశం ఇవ్వవా" అని

★★★



## అహం — గోవింద్

అహం నాకు లేదనే అహం
అహం నా జీవన గమనానికి ప్రాణం

అహం అద్దంలా కనిపిస్తుంది అవతలి వాళ్లకు
అహం అందంగా కనిపిస్తుంది అది ఉన్న వాళ్లకు

అహం అలంకారమై భాసిల్లుతుంది జ్ఞానులకు
అహం అంధకారమై బాధిస్తుంది అజ్ఞానులకు

నేనూ చేయగలను అన్నది నా విశ్వాసం
నేను మాత్రమే చేయగలను అన్నది నా అహం
అప్పుడే ప్రారంభ మైనది నా విధ్వంసం
అయినా అది కూడా గమనించ లేదు నా అహం

అహం లో తేలిపోతూ
ఇహం లో వాలిపోతూ
అయినవారిని వదులుకుంటూ
కానివారిని కలుపుకుంటూ
కలలనే నిజమనుకుంటూ
ఈ జీవితం కరిగి పోతున్నది

శయన మందిరం నుంచి
శ్మశాన పంజరం వరకు
అహం ఒక్కటే నన్ను అంటిపెట్టుకొని వుంది

***

## రాత్రి — మూలా వీరేశ్వరరావు

సంధ్య కాంత రాత్రి తో
రమించ డానికి
చీకటిని కాపలా పెట్టింది !
వి శ్వ రహస్యం తెలుసు
కో వడానికి న క్షత్రాల
వాయొరిజం !
మిల్కీ  వే  రహస్యం తెలిసి
మండుతూ రాలిన ఉల్కలు !
వె న్నెల దాచుకొని దొబూచులాడే
చంద్రుడు !
రాత్రే కలలకు ఇంధనం !
రాత్రి రహస్య అంతర్మధనం !

***



# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

నాకు వగపేల నా పరిణయదినాన?
పరిణయమ్మన్న నానంద వార్ధి కాదె?
కావలయునంటినీ మార్పు జీవితమున
వచ్చి తలుపు తట్టిన నాడు వగపిదేమి?

ఎదురు తెన్నులు చూచితినిన్ని నాళ్ళు
కనులు కాయగ నీ శుభఘడియ కొరకు
ఇంత కాలము కష్టమ్మునెరుగకున్న
క్రొత్త జీవితమ్మును మది కోరుకొంటి

గతము సర్వమానందసంగతము నాది
భావియును స్వర్గసీమకు బాట యౌను
ఐననేదియో చింత లోలోన మెదలు
అపరిచితమైన పథమున నడుగిడంగ

నడచిపోయిన కాలమానందమయము
ఈ దినమ్మెనలేని సమ్మోదకరము
వచ్చు కాలము సర్వము స్వర్గసమము
కాలధర్మము పాటించి కలిగె గతము

గడచిన దినమ్ములుండును కలలవోలె
మరల మరల యేతెంచి సమ్మదము గూర్చు
కలసి నీ తోడ నడచునీ చెలిమి కలిమి
చెంతనుండును మధురమై చివరివరకు



చిత్రం: కె.రామ్మోహన్

COMMENTS